సాక్షి
ప్రకాశం

సోమవారం । 11 । మార్చి । 2024



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి విడదల రజిని, లక్ష్మీపార్వతి, బాలినేని, మోపిదేవి, బీద మస్తాన్‌రావు తదితరులు





బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జయ జయ జయహో..

సిద్ధం సభ జన సంద్రం



మా నమ్మకం నువ్వే అన్నా: సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యువత



కెవ్వు కేక : సమరానికి సిద్ధమంటూ విజిలేస్తున్న మహిళ



ఓ అన్నా.. నీవెంటే మేమంటూ నినదిస్తున్న యువతి

సైన్యంలా...ఓ శాసనంలా
ఊళ్లన్నీ ఒక్కటిగా.. జనమంతా ఐక్యంగా
జన చేతన పొంగిన సంద్రంలా
కొత్త ఒరవడికి శ్రీకారంలా...
భూదేవి నుదుట దిద్దిన సిందూరంలా
మహోజ్వల ఘట్టానికి మలి మెట్టులా
సువర్ణ అధ్యాయానికి జన సంతకంలా
చరిత్ర పుటల్లో తమకంటూ ఓ పేజీలా
సమరోత్సాహంతో...సమధికోత్సాహంతో...
కదనరంగానికి దుమికినట్టు..
కార్యోన్ముఖులై కదిలినట్టు
జన సారథి వెంట జనవారధి కట్టినట్టు
రాజన్న బిడ్డ పాలన మళ్లీ రావాలంటూ
అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా
గడప గడప నుంచి.. పల్లె పల్లె నుంచి
జన సమూహాలు జన సందోహాలు
సిద్ధం సభకు తరలి వచ్చిన తీరు
మరో మహోద్యమాన్ని తలపించింది..
రేపటి భవితను సాక్షాత్కరించింది.



- అన్నిదారులూ బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపే..
- ఉదయం నుంచే సభాస్థలికి తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- జనసంద్రంగా మారిన సభా ప్రాంగణం
- వందలాది ఎకరాలతోపాటు స్తంభించిన జాతీయ రహదారి
- సీఎం వైఎస్ జగన్ ప్రసంగంతో ఆద్యంతం హోరెత్తిన జనస్పందన
- నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధం అంటూ నినదించిన జనం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభ జనంతో పోటెత్తింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ సభకు ఆయా జిల్లాలనుంచి జనం లక్షలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం తరువాత సభ జరగాల్సి ఉన్నా ఉదయం 9 గంటలనుంచే జనం సభా ప్రారంభానికి చేరుకోవడం ప్రారంభమైంది. 11 గంటల ప్రాంతానికి మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారివద్ద వందలాది ఎకరాల్లో సిద్ధం చేసిన సిద్ధం సభా ప్రాంగణం జనంతో నిండి పోయింది. సమీపంలోని పొలాలతోపాటు పక్కనే ఉన్న చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి సైతం సభకు వచ్చిన జనంతో కనుచూపుమేర జనసంద్రంగా మారింది. ఈ రహదారిలో మేదరమెట్ల నుంచి రేణంగివరం వరకు 18 కిలోమీటర్ల వరకు రోడ్డు జనంతో కిక్కిరిసి పోయింది. మరోవైపు మేదరమెట్ల నుంచి అద్దంకి వరకు (హైదరాబాద్) ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. పిల్లలు, యువత, మధ్యవయస్కులు, వృద్ధులు, మహిళలు అన్నతేడా లేకుండా అన్నివర్గాలవారు వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని సభకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలకు వినిపించేలా జై జగన్ అన్న సభికుల నినాదాలు సభలో హోరెత్తించాయి.



ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండు సార్లు బటన్ నొక్కేందుకు సిద్ధం..

58 నెలల్లో మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్‌నొక్కి రూ. 2.70 లక్షల కోట్లు మీ ఖాతాల్లో వేశానని, నా కోసం మీరు రెండు బటన్లు నొక్కలేరా అనగానే నొక్కుతాం...నొక్కుతాం అంటూ పెద్ద ఎత్తున ప్రతిధ్వనించారు. మీ బిడ్డకు ఓటేస్తే అన్ని పథకాలు అందుతాయని, బాబుకు ఓటేస్తే చంద్రముఖిని మనమే వెళ్లి నిద్రలేపి ఇంటికి తెచ్చుకున్నట్లేనని జగన్ అనడంతో అవును... అవును...అంటూ ప్రజలు స్పందించారు. 2019 మించి 175 కు 175 ఎమ్మెల్యేలు, 25 కు 25 ఎంపీలు గెలవడానికి మనమంతా సిద్ధమేనా అనగానే సిద్ధం..సిద్ధం అంటూ జనం హోరెత్తించారు. త్వరలోనే మేనిఫెస్టో ప్రకటిస్తానని, జగన్ మాట ఇచ్చాడంటే తగ్గేదేలే అంటూ అనగానే జనం ఈలలు, కేకలతో సభ దద్దరిల్లింది. మళ్లీ నిన్నే గెలిపించుకుంటామంటూ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలపై విమర్శలు బాణాలు సంధించినప్పుడు జనంలో ఉత్సాహంతో కూడిన ప్రతిస్పందన కనిపించింది. ఈ ఎన్నికల్లో వారి అంతు తేలుస్తామంటూ జనం ఆగ్రహంతో ఊగిపోయారు. కుట్రలు, కుతంత్రాలకు ముగింపు పలుకుతామంటూ నినదించారు. సభ ఆద్యంతం సీఎం...సీఎం అంటూ హోరెత్తించారు.ఈ సభలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయి రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాం కృష్ణమూర్తి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, నియోజకవర్గ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్, యడం బాలాజీ, ఈవూరి గణేష్, వరికూటి అశోక్, వైవీ భద్రా రెడ్డి పాల్గొన్నారు.





ర్యాంపు వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నేను సైతం..

అపూర్వ స్పందన..

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు చేరుకున్నారు. తర్వాత సభావేదిక మీదకు చేరుకున్న ముఖ్యమంత్రి 4.47 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.56 గంటలకు ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ఆయన ప్రతిమాటా తూటాలా పేలింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి సూటిగా జనం ముందుంచారు. పథకాలతో జనానికి జరిగిన మేలును గణంకాల రూపంలో వివరించారు. ముఖ్యంగా పేదవర్గాల జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడ్డాయో తెలియ జెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేశారు. ప్రతిపక్షాలపై జగన్ విరుచుకు పడటంతో జగన్ గొంతులో గొంతు కలిపి తమదైన శైలిలో మద్దతు పలికారు. మరో ఐదేళ్లు ఈ ప్రభుత్వం కొనసాగాలంటే మీరు మద్దతు పలికేందుకు సిద్ధమా.? అనడంతో సిద్ధం..సిద్ధం అంటూ జనం ఈలలు, కేకలతో స్పందించారు. 'జగన్ సీఎం...సీఎం ' అంటూ నినాదాలు చేశారు. పేదవాడి భవిష్యత్తు కాపాడేందుకు నాతో కలిసి రావడానికి మీరు సిద్ధమా...? అని సీఎం అనగానే సిద్ధం అంటూ జనం ప్రతిస్పందించారు. పార్టీలతో బాబు.....ప్రజలతో మనం ఈ సంగ్రామానికి జనం సిద్ధమా... అనగానే సిద్ధం ...సిద్ధం అంటూ హోరెత్తించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం..., ఉత్తర కోస్తా సిద్ధం, రాయలసీమ సిద్ధం... తాజాగా దక్షిణ కోస్తా సిద్ధం అంటూ జగన్ అనగానే సిద్ధం...సిద్ధం అంటూ ప్రజలు ప్రతిధ్వనించారు.

ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నం..

ఈ యుద్ధంలో మీది శ్రీకృష్ణుడి పాత్ర, నాది అర్జునుడి పాత్ర, దుష్టులపై అయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాలు దింపాల్సిన సమయం ఆసన్నమైందంటూ జగన్ భారతాన్ని ఉటంకించడంతో జనం కేరింతలు కొట్టారు. చంద్రబాబు లాగా మనకు 10 మంది నటించే పొలిటికల్ యాక్టర్లు లేరు....రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. అందుకే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నాను. మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లు. ప్రతిపక్ష పార్టీలో సైన్యాధిపతులు తప్ప సైన్యం లేదని 5 కోట్ల మంది సైన్యం అండదండలతో మనం సిద్ధం అని ముఖ్యమంత్రి అనగానే జనం ఈలలు, కేకలతో స్పందించారు. చంద్రబాబుకు దోచుకునేందుకు, దాచుకునేందుకే అధికారం కావాలని జగన్ అనడంతో జనం అవును...అవును అంటూ నినదించారు.





సిద్ధం సభకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం



సిద్ధం సభ వద్ద యువత కేరింత


సభా ప్రాంగణం బయట ఎల్ఈడీ స్క్రీన్‌పై సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న అభిమానులు


మార్కాపురం నుంచి తరలివెళ్తున్న వారితో ఎమ్మెల్యే అన్నా రాంబాబు


గిద్దలూరులో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సిద్ధం సభ హెలిప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ

అధినేతకు తోడుగా.. యుద్ధానికి సిద్ధం

- దారులన్నీ సిద్ధం సభ వైపే
- జిల్లా నుంచి లక్షలాదిగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పి.గుడిపాడు నుంచి మద్దిపాడు వరకు జనసందోహమే
- సాయంత్రం 5 గంటల వరకు తరలివస్తూనే..
- సిద్ధం సభ విజయవంతం కావడంతో పార్టీ నేతలు, కేడర్‌లో రెట్టించిన ఉత్సాహం


సిద్ధం సభా ప్రాంగణానికి ఉదయాన్నే చేరుకున్న వికలాంగుడు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: భగభగమంటూ సూర్యుడు చురుక్కుమనిపించినా.. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని పి.గుడిపాడు వేదికగా జరిగిన సిద్ధం చిట్టచివరి సభకు తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4.20 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించేంత వరకూ వాహనాల ద్వారా తరలివెళ్తూనే ఉన్నారు. దారులన్నీ కొరిశపాడు మండలం పి.గుడిపాడువైపే అన్నట్టుగా సాగాయి. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి వేలాదిగా బస్సులు, కార్లు, ఇతర వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాల్లో లక్షలాదిగా పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. తొలుత భీమిలి, ఆ తర్వాత జరిగిన దెందులూరు, రాప్తాడు సభలు ఆహా...ఓహో అనుకుంటే నాలుగో సభకు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ శ్రేణులు తరలిరావడంతో పి.గుడిపాడును జనసునామీ చుట్టేసినట్లయింది. సాయంత్రం 5.40 గంటలకు సీఎం ప్రసంగం ముగిసినా మద్రాస్–కోల్‌కతా జాతీయరహదారి సభా ప్రాంతానికి అటు నాలుగు, ఇటు నాలుగు కిలోమీటర్ల మేర ఎటుచూసినా రోడ్డుపై జనమే కనిపించారు. అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతలు 'జగన్ కావాలి..జగన్ రావాలి'.. ఎన్నికల సమరానికి సిద్ధం అంటూ చేసిన నినాదాలతో జాతీయ రహదారి హోరెత్తిపోయింది. రాష్ట్రంలోనే కనీవినీ ఎరుగని రీతిలో సభకు అభిమానగణం తరలి రావడం అందరిలో జోష్ నింపింది. ఇదిలా ఉండగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి లక్షలాదిగా పార్టీ కేడర్ తరలివెళ్లింది. జిల్లా కేంద్రం ఒంగోలు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో సభకు హాజరుకావాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బాలినేని నేతృత్వంలో వందలాదిగా బస్సులు, కార్లు, ఆటోల్లో స్వతంత్రంగా పార్టీ కేడర్, అభిమానులు తరలివెళ్లారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలపై కూడా వేలాది మంది సభకు వెళ్లారు. గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా వాహనాలు తరలివెళ్లాయి. పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో వేల సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు. యర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త తాడిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెట్టించిన ఉత్సాహంతో సిద్ధం సభకు వెళ్లారు. కనిగిరిలో కూడా అన్ని మండలాల నుంచి పార్టీ కేడర్ ఎంతో ఆనందంగా నూతనంగా నియమించిన పార్టీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో సిద్ధం సభకు వెళ్లారు. దర్శి నియోజకవర్గం నుంచి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో సిద్ధం సభకు తరలివెళ్లారు. కొండపి నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ప్రతి మండలం నుంచి జనాలు తరలివెళ్లారు. సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున వేలాది వాహనాల్లో భారీ స్థాయిలో సిద్ధం సభకు ప్రజలను తీసుకెళ్లారు. విశాఖపట్నం, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఒంగోలు నుంచి దారి మళ్లించారు. వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా ఎస్పీ పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


కనిగిరి నుంచి వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్

నెల రోజుల్లో మూడోసారి...

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలరోజుల వ్యవధిలో మూడు సార్లు వచ్చారు. ఫిబ్రవరి 23వ తేదీ ఒంగోలు నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ నెల 6వ తేదీ ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు మేలు చేసే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసేందుకు వచ్చారు. వెంటవెంటనే సీఎం వైఎస్ జగన్ వచ్చినా.. ఆయనపై ఏమాత్రం ప్రేమాభిమానాలు చెక్కుచెదరలేదు. జననేత కోసం జిల్లా నుంచి లక్షలాదిగా తరలివెళ్లడం చూస్తే ప్రజల గుండెల్లో ఏ స్థాయిలో అభిమానం ఉందో అర్థమవుతోంది.

దారిమళ్లిన వాహనాలు..

ఒంగోలు సిటీ/ఒంగోలు అర్బన్: మేదరమెట్ల వద్ద జరిగిన సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సిద్ధం సభకు వెళ్తున్న బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు మినహా హైదరాబాద్, విజయవాడ వెళ్తున్న వాహనాలను దారిమళ్లించారు. విజయవాడ వెళ్లే వాహనాలను దారి మళ్లించేందుకు త్రోవగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అలాగే, త్రోవగుంట మలుపు వద్ద మరో చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కర్నూలు రోడ్డు, చీమకుర్తివైపు దారిమళ్లించారు.


చీరాల వైపు వెళ్లడానికి త్రోవగుంట వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ చెక్‌పోస్టు


వై.పాలెంలో బస్సులను తరలిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్


హైవేపై సిద్ధం సభకు వెళ్తున్న బస్సులు, కార్లు


సిద్ధం సభకు వెళ్లే దారిపొడవునా బాలినేని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


చీమకుర్తి వైపు నుంచి సిద్ధం సభకు వెళ్తున్న బస్సులు

ఉద్యోగాల పేరుతో ఆర్మీ ఉద్యోగి మోసం

- నిరుద్యోగుల నుంచి రూ.లక్షల వసూలు
- తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నాడని బాధితుల ఫిర్యాదు

పామూరు: ఆర్మీలో ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి ఆర్మీ ఉద్యోగి నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల వివరాల ప్రకారం...మండలంలోని మార్కొండాపురం పంచాయతీ పరిధిలోని సోమన్నపల్లి గ్రామానికి చెందిన డబ్బుగొట్టు మల్లికార్జున ఆర్మీలో పని చేస్తున్నాడు. మల్లికార్జున, ఆయన సోదరుడు మనోహర్, బావమరిది బొట్లా నాగార్జునలు అక్రమంగా సంపాదించాలన్న ఉద్దేశంతో నిరుద్యోగ యువతను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో నిర్మల్‌కు చెందిన మదర్ డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ సంస్థ పేరుతో ఆర్మీలో ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతకు గాలం వేశారు. ఈ క్రమంలో డబ్బుగొట్టు మల్లికార్జున.. సీహెచ్.సాయికిరణ్ వద్ద రూ.4.50 లక్షలు, ఎస్.సాయికుమార్ వద్ద రూ.3 లక్షలు, యం.తరుణ్‌కుమార్‌వద్ద రూ.3 లక్షలు, బి.సందీప్ వద్ద రూ.లక్ష మొత్తాన్ని తీసుకున్నారు. ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పించకపోతే రూ.2 వడ్డీతో సహా చెల్లిస్తామని మల్లికార్జున బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ రాసి సంతకం చేసి ఇచ్చినట్లు సాయికిరణ్, సాయికుమార్, తరుణ్‌కుమార్ తెలిపారు. మరో బాధితుడు పామూరుకు చెందిన షేక్.ఇమామ్ మాట్లాడుతూ తనకు తన మిత్రుడు ద్వారా డబ్బుగొట్టు మల్లికార్జున పరిచయం అయ్యాడని, తన వద్ద అప్పు కింద రూ.4 లక్షలు తీసుకున్నాడని, తాను కారును ఫైనాన్స్‌లో మల్లికార్జున తల్లి పద్మ పేరుపై మొత్తం అసలు వడ్డీతో కలిసి రూ.12.50 లక్షలు చెల్లించి కొనుగోలు చేయగా కిస్తీలు పూర్తవ్వగానే కారును 2023 ఫిబ్రవరిలో మల్లికార్జున తనదని బలవంతంగా తీసుకుపోయాడని వాపోయాడు. 2021లోనే మల్లికార్జున ఉద్యోగాలు పేరుతో డబ్బులు వసూలు చేశాడు. అయితే ఎన్నిసార్లు అడిగినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో అనుమానంవచ్చి నగదు తిరిగి ఇవ్వాలని మల్లికార్జునను ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు వాపోయారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

త్రిపురాంతకం: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. త్రిపురాంతకం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన యువకుడు అలగముతక శ్రీను (23) మిట్టపాలెం నుంచి త్రిపురాంతకం మహాశివరాత్రి రథోత్సవానికి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఎస్ఐ సాంబశివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంభో శివ శంభో..


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న బాలినేని శచీదేవి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు


రథం లాగడానికి పోటీపడుతున్న భక్తులు

- మడనూరులో మార్మోగిన శివనామస్మరణ
- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరస్వామికి కన్నుల పండువగా రథోత్సవం
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన మడనూరు, ఈతముక్కల గ్రామాలు
- ముఖ్య అతిథిగా హాజరైన బాలినేని శచీదేవి
- రథాన్ని లాగేందుకు పోటీపడిన యువకులు, మహిళలు

మడనూరు (కొత్తపట్నం): హరహర మహాదేవ శంభో శంకర నినాదం మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలో నాలుగో రోజైన ఆదివారం సాయంత్రం రామలింగేశ్వరస్వామికి కన్నుల పండువగా రథోత్సవం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో మడనూరు, ఈతముక్కల గ్రామాలు కిక్కిరిసిపోయాయి. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి ముఖ్య అతిథిగా హాజరై రథం లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో మడనూరు రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. రోడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రమణారెడ్డి, గ్రామ పెద్దల పర్యవేక్షణలో ముందుగా రథం వద్ద వంశపారంపర్య ఆగమకర్త కొంపల్లి వీరభద్రరావు, వారి కుటుంబీకులు బుచ్చేశ్వరరావు, సతీమణి నాగలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ముస్తాబు చేసిన గంగా పర్వతి వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో రథంపై ప్రతిష్ఠించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలినేని శచీదేవి ఆలయంలో పూజలు చేసి రథం వద్దకు చేరుకున్నారు. ఈవో రమణారెడ్డి, సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఆళ్ల రవీంద్రరెడ్డి, బద్దేల పుల్లారెడ్డి, లింగారెడ్డి సతీష్‌రెడ్డి, బి.శంకర్ రెడ్డి, బద్దేల ప్రమోద్‌రెడ్డి, బద్దేల పుల్లారెడ్డి, కేశవరపు కోటిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, ఎల్.శంభుప్రసాద్ రెడ్డి, కాపులు రథం ముందు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అప్పటికే సిద్ధం చేసిన రథానికి కట్టిన తాడును బాలినేని శచీదేవితో కలిసి పట్టుకుని హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ రథాన్ని ముందుకు లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం లాగడానికి యువకులు, మహిళలు, భక్తులు పోటీపడ్డారు. రథం వేగంగా వెళ్లకుండా ముందుగా పోలీస్ వ్యాన్ ఉంచారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఈతముక్కల నుంచి మడనూరు రామలింగేశ్వరస్వామి ఆలయం వరకు భక్తసంద్రంగా మారింది. పుర వీధులన్నీ నిండిపోయాయి. రథం వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల ఇళ్లవారు రథం చక్రాలు కింద గుమ్మడికాయలు, పండ్లు పెట్టి స్వామివారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మడనూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి బయలుదేరిన రథం.. ఈతముక్కల గ్రామానికి చేరుకుంది. రాత్రికి అక్కడే నిద్ర చేసి సోమవారం మడనూరు గ్రామానికి చేరుతుంది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ జగదీష్, ఎస్సై బి.సాంబశివరావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అనేక రకాలుగా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది స్పెషల్ పార్టీవారు, 23 మంది కానిస్టేబుళ్లు, 8 మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.